సాక్షి సిద్దిపేట

బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



బతుకమ్మ ఆడుతున్న యూనిసెఫ్ బృందం సభ్యులు

న్యూస్‌రీల్

నేడు బీఆర్‌ఎస్ బహిరంగ సభ



చురుకుగా సాగుతున్న సభ ఏర్పాట్లు

హుస్నాబాద్: మండల పరిధిలోని పోతారం (ఎస్)లో బుధవారం బీఆర్‌ఎస్ బహిరంగ సభ జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మంత్రి హరీశ్ రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, ఎమ్మెల్యే సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ హాజరుకానున్నారు. పార్టీ అధినేత సీఎం కేసీఆర్ గత నెలలోనే హుస్నాబాద్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను ప్రకటించిన విషయం విదితమే. వారం రోజుల క్రితం ఎమ్మెల్యే ఎల్కతుర్తి మండలం జగన్నాథపురంలో ఎన్నికల శంఖారావాన్ని పూరించారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం



అవిశ్వాస నోటీస్ అందిస్తున్న డైరెక్టర్లు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల పీఏసీఎస్ చైర్మన్ వంగ చంద్రారెడ్డిపై డైరెక్టర్లు మంగళవారం డీసీవో కరుణకు అవిశ్వాస నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార సంఘంలో చైర్మన్ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఉన్నత అధికారులు స్పందించి అవిశ్వాసం తీర్మానం ప్రవేశ పెట్టాలన్నారు. నోటీస్ ఇచ్చినవారిలో డైరెక్టర్లు బాల్‌రెడ్డి, నర్సింహులు, మాధవరెడ్డి ,కృష్ణ, శ్రీనివాస్, జ్యోతి, వసంత, రవి పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహిద్దాం



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

సిద్దిపేటరూరల్: పండుగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకుందామని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సూచించారు. రాబోయే రెండు నెలల్లో వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ, బతుకమ్మ, దసరా పండుగలు వస్తున్న నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పీస్–కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీపీ శేత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడైనా ఎలాంటి అవాంఛనీయ సంఘటన ఎదురైనా దగ్గరలో ఉన్న పోలీస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. సోషల్ మీడియాలో అవాంఛనీయ సంఘటనలకు సంబంధించి పోస్టులు పెట్టినా, ప్రచారం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు రమేష్, బాబు బన్సీలాల్, డీఎస్‌ఓ తనుజ, ఏసీపీలు రమేష్, సురేందర్ రెడ్డి, సతీష్, మున్సిపల్ కమిషనర్లు, వివిధ మతాల పెద్దలు పాల్గొన్నారు.

పీజీ ఎంట్రన్స్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ



ఓరం అనూషను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

సిద్దిపేటఎడ్యుకేషన్: ఉస్మానియా యూనివర్సిటీ విడుదల చేసిన పీజీ ఎంట్రన్స్ ఫలితాల్లో సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఓరం అనూష డాటా సైన్స్ సబ్జెక్టులో రాష్ట్రస్థాయిలో 11వ ర్యాంకు సాధించారు. మంగళవారం అనూషను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ ప్రసాద్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని శిఖరాలు అధిరోహించాలని అనూషకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ సుదర్శనం, పీజీ కోఆర్డినేటర్ డాక్టర్ అయోధ్యరెడ్డి, అకాడమిక్ సెల్ కన్వీనర్ డాక్టర్ భవాని, ఫిజిక్స్ అండ్ డాటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ మధుసూదన్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆ బడిలో ఇద్దరే..

అక్కన్నపేట మండలం ఫకీర్‌తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరే విద్యార్థులున్నారు. వీరు ఒకటవ తరగతి చదువుతున్నారు. ఒక ఉపాధ్యాయుడు బోధిస్తున్నారు. గతేడాది మొత్తం ఎనిమిది మంది ఉండగా, ఆరుగురికి గురుకులంలో సీట్లు రావడంతో వెళ్లారు. ప్రస్తుతం ఇద్దరు మాత్రమే మిగిలారు. అలాగే పంతులీతండాలోని ప్రాథమిక పాఠశాలలో సైతం ఐదుగురు విద్యార్థులే ఉన్నారు. ఇక్కడ గతేడాది దాదాపు 17మంది ఉండగా తల్లిదండ్రులు ప్రైవేట్‌కు పంపించారు. ప్రస్తుతం ఐదుగురు విద్యార్థులు, ఇద్దరు టీచర్లు ఉన్నారు.

– అక్కన్నపేట(హుస్నాబాద్)



ఫకీర్‌తండాలోని పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

బడులు భేష్..

సిద్దిపేటరూరల్: పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు చాలా బాగున్నాయని యూనిసెఫ్ బృందం కితాబునిచ్చింది. మంగళవారం సిద్దిపేట మండలం రాఘవాపూర్, చిన్నగుండవెల్లిలోని పాఠశాలలను యూనిసెఫ్ బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి డప్పులు, బోనాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఇంకుడుగుంత, డైనింగ్‌హాల్, మరుగుదొడ్లు, తరగతి గదులు, అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాల స్టాల్, కంపోస్టు ఎరువు, స్వచ్ఛ నీటి వినియోగం వంటివాటిని పరిశీలించారు. స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. విద్యార్థులు చేసిన మల్లకంబ విన్యాసాలను తిలకించారు. అనంతరం బృందం సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ ఎంతో బాగుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఎం కన్సల్టెంట్ చెన్నారెడ్డి, బృందం ప్రతినిధులు, డీపీఓ దేవకీదేవి తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మతో బృందం సభ్యురాలు



విద్యార్థుల మల్లకంబ విన్యాసం

పరీక్షరాసి వస్తూ మృత్యుఒడికి..

అనంతసాగర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ముగ్గురు బీటెక్ విద్యార్థుల దుర్మరణం
- మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు
- మృతుల కుటుంబాల్లో తీరని విషాదం

చిన్నకోడూరు(సిద్దిపేట): వారంతా బీటెక్ విద్యార్థులు.. ఎంతో సంతోషంగా పరీక్షలు రాశారు. తోటి మిత్రులతో కలిసి క్వాలిస్ వాహనంలో వెళ్తుండగా మృత్యువు మాటువేసింది. వీరు ప్రయాణిస్తున్న వాహనం ఆగిఉన్న లారీని ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. చిన్నకోడూరు మండలం అనంతసాగర్ వద్ద మంగళవారం చోటుచేసుకున్న విషాదకర ఘటన వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణ శివారులోని ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 11 మంది బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు రెండో సెమిస్టర్ పరీక్షలు రాస్తున్నారు. వారంతా కలసి తోటి మిత్రుడు క్వాలిస్ వాహనం తీసుకొని ఐదు రోజులుగా పరీక్షల కోసం కరీంనగర్ వెళ్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం పరీక్ష రాసి తిరిగి వస్తున్నారు. సిద్దిపేట మండలం పెద్దలింగారెడ్డిపల్లికి చెందిన తౌటి దేవచంద్(20) వాహనం నడుపుతున్నాడు. అనంతసాగర్ శివారులో రోడ్డు పక్కన పార్కు చేసిన ఇసుక లారీని వేగంగా వచ్చిన వీరి వాహనం ఢీకొంది. దీంతో క్వాలిస్‌లో ఉన్న సిద్దిపేటకు చెందిన కళావిపిన్ చంద్ర (19), నేతి నాగరాజు(20), పయ్యావుల గ్రీష్మ(18) అక్కడికక్కడే మృతి చెందారు. నమ్రత (సిద్దిపేట), ప్రవళిక (దర్గపల్లి, నంగునూరు మండలం), చైతన్య (సిద్దిపేట), దేవచంద్ (పెద్దలింగారెడ్డిపల్లి)లకు తీవ్ర గాయాలు కావడంతో సికింద్రాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సాయిచంద్ (చేగుంట), రోహిత్ రెడ్డి (రామాయంపేట), కర్రె రాజు(గజ్వేల్), సాయి నితిన్ (తిమ్మాపూర్, దుబ్బాక మండలం) సిద్దిపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుభాష్ గౌడ్ తెలిపారు. ఈ ఘటన మృతుల కుటుంబాల్లో తీరని విషాదం నింపింది.



విపిన్ చంద్ర



నాగరాజు



గ్రీష్మ



ప్రమాద ఘటన దృశ్యం.. విద్యార్థుల మృతదేహాలు

తల్లడిల్లిన తల్లిదండ్రులు



సిద్దిపేటకు చెందిన పయ్యావుల వరలక్ష్మి–నర్సింహులు దంపతులకు ఇద్దరు కూతుళ్లు. వారు ఇంజనీరింగ్ చదువుతున్నారు. సెలూన్ షాపులో పనిచేస్తూ వచ్చిన ఆదాయంతో పిల్లల ఫీజులు చెల్లిస్తున్నారు. పెద్ద కూతురు బీటెక్ రెండో సంవతర్సం, చిన్న కూతురు గ్రీష్మ మొదటి సంవత్సరం చదువుతోంది. గ్రీష్మను రోడ్డు ప్రమాదం బలితీసుకోవడంతో కన్నీరుమున్నీరయ్యారు. ప్రమాదంలో బిడ్డను కోల్పోయిన ఆ తల్లిదండ్రుల రోదన పలువురిని కంటతడి పెట్టించాయి.

చేతికొచ్చిన కుమారుడు శవమై కనిపించడంతో..

సిద్దిపేట పట్టణానికి చెందిన నేతి నర్సింహులు–మంజుల దంపతులకు ఇద్దరు కుమారులు. నర్సింహులు ప్రైవేటు ఏజెన్సీలో గుమాస్తాగా పని చేస్తూ ఇద్దరు కుమారులను ఉన్నత చదువులు చదివిస్తున్నాడు. పెద్ద కుమారుడు నాగరాజు బీటెక్ మొదటి సంవత్సరం, రెండో కుమారుడు నవీన్ ఇంటర్ చదువుతున్నాడు. ఈ క్రమంలో పెద్ద కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో చేతికందిన కుమారుడు కళ్ల ముందే శవమై కనిపించడంతో వారి రోదనలు మిన్నంటాయి.



మల్లారెడ్డిలో సీటు వచ్చినా..



సిద్దిపేటకు చెందిన కళా సదాశివ్– అర్చన దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు విపిన్ చంద్ర బీటెక్ మొదటి సంవత్సరం, చిన్న కుమారుడు కీర్తన్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం. తల్లిదండ్రులు ఇద్దరు పని చేస్తూ పిల్లలను చదివిస్తున్నారు. విపిన్ మొదటగా మల్లారెడ్డి కళాశాలలో సీటు రావడంతో అందులో చేరాడు. కానీ వాతావరణం పడకపోవడంతో ఇందూరు కళాశాలలో చేరాడని, అదే శాపంగా మారిందని తల్లిదండ్రులు బోరున విలపించారు.

‘పరీక్ష కేంద్రం దూరంగా ఉండటం వల్లే..’

సిద్దిపేటఅర్బన్: ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బీటెక్ ఫస్టియర్ విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం దురదృష్టకరమని, పరీక్ష కేంద్రాన్ని సిద్దిపేట జిల్లా కేంద్రంలో కాకుండా పక్క జిల్లాలో ఏర్పాటు చేయడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు అన్నారు. పరీక్ష కేంద్రం గతంలో కొండపాకలోని మెదక్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసినప్పుడు సిద్దిపేటకు సమీపంలోనే ఉండడంతో విద్యార్థులకు కొంత వరకు సౌకర్యంగా ఉండేదని తెలిపారు.

మంత్రి హరీశ్ దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాద ఘటనపై మంత్రి హరీశ్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ముగ్గురు విద్యార్థుల మృతి కలిచి వేసిందన్నారు. తీవ్రంగా గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ఆధైర్యపడొద్దని, అండగా ఉంటానని విద్యార్థుల కుటుంబాలతో ఫోన్‌లో మాట్లాడి మనోధైర్యాన్ని నింపారు.

అమృతవాటికలో పుల్లూరు పేరు లిఖిస్తాం

- కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల
- పుల్లూరు గ్రామంలో మట్టి సేకరణ

సిద్దిపేటరూరల్: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులను గౌరవించేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఢిల్లీలో అమృత వాటికను ఏర్పాటు చేస్తున్నారని కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల తెలిపారు. అందులో భాగంగానే మేరీ మాటి.. మేరా దేశ్ (నా మట్టి.. నా దేశం) కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా తిరిగి మట్టి సేకరించారు. పలువురి ఇళ్ల నుంచి బియ్యం స్వీకరించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 7,500 కలశాల్లో పవిత్ర మట్టిని సేకరిస్తున్నామన్నారు. ఆ పవిత్రమైన మట్టితో ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం సమీపంలో అమృత్ వాటికను నిర్మించి.. దానిలో మొక్కలు నాటనున్నారన్నారు. ఈ అమృత వాటిక ఉద్యానవనం.. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కు చిహ్నంలా నిలుస్తుందన్నారు. ఇక్కడి నుండి తీసుకెళ్లిన మట్టిని అమృతవాటికలో వినియోగించి అక్కడ పుల్లూరు గ్రామ పేరును లిఖిస్తామన్నారు. అంతకుముందు బీజేపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ మండల శాఖ అధ్యక్షుడు మల్లమ్మగారి శ్రీనివాస్‌రెడ్డి , అసెంబ్లీ కన్వీనర్ ఉపేందర్ రావు, సీనియర్ నాయకులు వంగ రాంచంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, విద్యాసాగర్ గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామంలో మహిళ నుంచి బియ్యం సేకరిస్తున్న కేంద్ర మంత్రి

నేడు మత్స్యకారులకు గుర్తింపు కార్డుల పంపిణీ

- హాజరుకానున్న మంత్రి తలసాని
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్

గజ్వేల్: నియోజకవర్గంలోని మత్స్యకార సహకార సంఘాల సభ్యులకు బుధవారం మంత్రి తలసాని శ్రీనివాస్ గుర్తింపు కార్డులను పంపిణీ చేయనున్నారు. ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ గజ్వేల్‌లోని మహతి ఆడిటోరియంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. కార్యక్రమానికి హాజరయ్యే మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మంత్రి తలసాని మర్కూక్‌లోని కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్‌లో చేప పిల్లలను వదులతారని కలెక్టర్ తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కమీషనర్ విద్యాధర్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

నేడు, రేపు రైలు ఇంజిన్ ట్రయల్

రైల్వే ట్రాక్ దగ్గరికి ఎవరూ రావొద్దు: అధికారులు

సిద్దిపేటఅర్బన్: గజ్వేల్–సిద్దిపేట రైలు మార్గంలో బుధవారం, గురువారం రైలు ఇంజిన్ ట్రయల్ రన్ జరగనుందని, 15న రైల్వే సేఫ్టీ అధికారుల సమక్షంలో రైలు ట్రయల్ రన్ నిర్వహించనున్నట్టు రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వే ట్రాక్‌పై 120 కి.మీ వేగంతో ఇంజిన్ ట్రయల్ రన్ జరుగుతుండడంతో రైలు పట్టాల సమీపంలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పట్టాల వైపు ఎవరూ రావొద్దని సూచించారు. రైల్వే గేటు సమీపంలో రోడ్డు దాటే ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 15 తేదీన రైల్వే సేఫ్టీ అధికారులు పూర్తి రైలును ట్రయల్‌రన్ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ చూపాలి



ఆరోగ్య మహిళా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

- అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్
- కాళ్లకుంటలో ఆరోగ్య మహిళా కేంద్రం ప్రారంభం

సిద్దిపేటకమాన్: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, ఆరోగ్య కేంద్రాల ద్వారా అందించే వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. కాళ్లకుంట బస్తీ దవాఖానలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాన్ని మంగళవారం గరీమా అగర్వాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మంగళవారం ఈ ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్య సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రజని, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్యమే ముఖ్యం: ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

కోహెడ(హుస్నాబాద్): మహిళా ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో మహిళా ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్న ఉద్దేశంతోనే ఆరోగ్య పథకం అమలు చేస్తోందన్నారు. ఇందులో 35 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. మహిళలు ఆరోగ్య కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొక్కుల కీర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్యామల తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన

అర్ధనగ్నంగా మోకాళ్లపై కూర్చొని..

కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

సిద్దిపేటరూరల్: విద్యాశాఖ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులు వినూత్న నిరసన చేపట్టారు. ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలంటూ చేపడుతున్న ఆందోళనలు మంగళవారం నాటికి 12వ రోజుకు చేరాయి. కలెక్టరేట్ ఎదుట అర్ధనగ్నంగా మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా సేవలను గుర్తించి ప్రభుత్వం వెంటనే తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జాక్ ముఖ్య సలహాదారు మల్కేయ సురేందర్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు సునీత, జిల్లా అధ్యక్షులు బాలకిషన్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బావిలో పూడిక తీస్తుండగా..


గాయాలతో రాములు

కొండపాక(గజ్వేల్): వ్యవసాయ బావిలో పూడిక తీస్తుండగా మట్టి పెల్లలు మీద పడి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చేర్యాల మండలంలోని చిట్యాల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా ఇలా షాంపూర్ గ్రామానికి చెందిన బల్లపు రాములు (40) కుటుంబ సభ్యులతో కలిసి చిట్యాలకు వలస వచ్చాడు. చిట్యాలలోని ఓ రైతు వ్యవసాయ భూమిలోని బావిలో మట్టిని తీసే పనికి రాములు వెళ్లాడు. బావిలో దిగి పనులు చేస్తుండగా మట్టి పెల్లలు అతనిపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనా స్థలానికి 108 వాహనం వెళ్లే దారి లేదు. దీంతో స్పైన్ బోర్డు మీద రాములును పడుకోబెట్టి అంబులెన్స్ వరకు మోసుకొచ్చారు. అనంతరం అతన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎల్లమ్మ దేవాలయంలో చోరీ

గజ్వేల్‌రూరల్: మండల పరిధి జాలిగామ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయంలో గుర్తుతెలియని దుండగులు హుండీ తాళం పగులగొట్టి సుమారు రూ.12వేల నగదు, గంటను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. మంగళవారం వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరిశ్రమలో అగ్నిప్రమాదం


పరిశ్రమ వద్ద సీఐ నయీముద్దీన్

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం పారిశ్రామిక వాడలో ఉన్న శ్రీ విలాస్ హైడ్రోటెక్ పరిశ్రమలో మంగళవారం స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అప్రమత్తమైన యాజమాన్యం ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. షార్ట్‌సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని యాజమాన్యం తెలిపారు. ఘటనా స్థలాన్ని బొల్లారం సీఐ నయీముద్దీన్ పరిశీలించారు.

గంజాయి పట్టివేత

గజ్వేల్‌రూరల్: గంజాయి తరలిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు గజ్వేల్ సీఐ జాన్‌రెడ్డి పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(ఏటిగడ్డ కిష్టాపూర్)కు చెందిన వల్లకాటి సాయికుమార్, పట్టణంలోని లక్ష్మీప్రసన్న కాలనీకి చెందిన కుకునూరు పోతరాజు అజయ్, సిద్దిపేటలోని భరత్‌నగర్ ప్రాంతానికి చెందిన కాల్వ వెంకటేష్, గజ్వేల్ పట్టణంలోని వాసవి నగర్‌కు చెందిన తిగుళ్ల గణేష్‌లు ప్రజ్ఞాపూర్‌లోని బస్‌డిపో సమీపంలోగల మెకానిక్ దుకాణం వద్ద మంగళవారం ఉదయం పెట్రోలింగ్ పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా రూ. 2లక్షల విలువైన సుమారు 21కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. నలుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. జల్సాలకు అలవాటుపడి ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు ప్రాంతం నుంచి తక్కువ ధరకు గంజాయిని తీసుకొచ్చి ఇక్కడ ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు.

భగీరథ హెడ్‌వర్క్స్‌ను సందర్శించిన విదేశీ బృందం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మండలం కోమటిబండ గుట్టపై నిర్మించిన మిషన్ భగీరథ హెడ్‌వర్క్స్ ప్రాంతాన్ని యూనిసెఫ్ నేషనల్ కమిటీ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా మంగళవారం భగీరథ హెడ్‌వర్క్స్ ప్రాంతానికి చేరుకున్న 30మంది సభ్యులతో కూడిన గ్లోబల్ డెలిగేషన్ బృందానికి సీఈ విజయ్‌ప్రకాష్, ఎస్ఈ శ్రీనివాస్‌చారితో పాటు ఈఈ రాజయ్యలు పథకం రూపకల్పన, నీటి శుద్ధి, తాగునీటి సరఫరా తీరు తదితర అంశాలపై వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ నాగార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రోత్సాహం కరువు!

- మట్టి గణపతుల తయారీదారుల దీనస్థితి
- ఉచిత విగ్రహాల పంపిణీతో ఉపాధి కరువు
- ప్రభుత్వం సబ్సిడీ రుణం అందించాలని వేడుకోలు


మట్టి విగ్రహాల తయారీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వినాయక చవితి వస్తుందంటే చాలు గ్రామాలు, పట్టణాల్లో చిన్నా పెద్దా చేసే సందడి అంతాఇంత కాదు. గణపతి విగ్రహాల కొనుగోలుతోపాటు మండపాల ఏర్పాటు, డెకరేషన్ చేయడంలో ప్రతిఒక్కరూ బిజీబిజీగా ఉంటారు. అయితే రంగులు, రసాయనాలతో తయారు చేసిన వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించడం వల్ల జల కాలుష్యం ఏర్పడుతుందని, తెలంగాణ సర్కార్ మట్టి వినాయకులను నెలకొల్పేలా ప్రోత్సహిస్తుంది. ప్రతీ సంవత్సరం మున్సిపాలిటీల ఆధ్వర్యంలో మట్టి వినాయకులను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటుంది. దీనివల్ల మట్టి వినాయకుల తయారీదారులకు సరైన ఆదాయం లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందించి ప్రోత్సాహం అందించాలని వారు కోరుతున్నారు. వినాయక చవితి సమీపిస్తుండడంతో తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రహదారులపై రంగురంగుల వినాయకుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పర్యావరణ పరిరక్షకులు, పండితులు మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని అవగాహన కల్పిస్తుండటంతో ఈ ప్రాంత ప్రజలు 35 ఏళ్లుగా మట్టి గణపతులను పూజిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. వీటిని నిమజ్జనం చేసినప్పుడు నీళ్లలో త్వరగా కరిగిపోయే అవకాశం ఉంటుంది. కొంత కాలంగా పాలకులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ప్రజలకు ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. కానీ, మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసేవారికి ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహం అందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్సిడీపై రుణాలు అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్‌లో నివాసముండే కుమ్మరి శంకర్ కుటుంబం 30 ఏళ్లుగా మట్టి విగ్రహాలను వివిధ రూపాల్లో తయారు చేస్తున్నారు. గతంలో విగ్రహాల తయారీకి కావాల్సిన బంక మట్టిని స్థానిక చెరువులో నుంచి తీసుకొచ్చేవారు. కానీ అవి కాస్త కాలుష్యం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు.

ట్రాక్టర్ బంకమట్టికి రూ.25 వేలు చెల్లిస్తున్నారు. దీని ద్వారా 8 ఇంచుల నుంచి 5 అడుగుల విగ్రహాలను తయారు చేస్తున్నారు. వీటిని సైజులను బట్టి రూ.35నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. 6 నెలల ముందు నుంచే విగ్రహాలను తయారు చేస్తున్నా అనుకున్న స్థాయిలో రాబడి రావడం లేదని తయారీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయడం వలన తక్కువ ధరకే విగ్రహాలను అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందని వారు వాపోతున్నారు.

సబ్సిడీపై రుణం ఇవ్వాలి



30 ఏళ్లుగా మట్టి గణపతులను తయారు చేస్తున్నాం. తమకు శ్రమకు తగిన ఫలితం రావడం లేదు. పలువురు మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయడం వలన మేము తక్కువ ధరకే విక్రయిస్తున్నాం. ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలి.

– కుమ్మరి శంకర్, మట్టి విగ్రహాల తయారీదారుడు, తెల్లాపూర్

జనవరి నుంచి మొదలుపెడతాం

జనవరి నుంచే మట్టి విగ్రహాల తయారి మొదలుపెడతాం. ప్రతీ ఏడాది సుమారు 4వేల విగ్రహాలను తయారుచేస్తాం. ఇందులో లాభాలు రాకపోయినా వృతిని కొనసాగిస్తున్నాం.

– కళ్యాణ్, వ్యాపారి, తెల్లాపూర్

అభివృద్ధికి తెలంగాణ దిక్సూచి

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి


తొగుటలో పీఆర్ డీఈ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): తెలంగాణ అభివృద్ధి దేశానికి దిక్సూచిగా నిలిచిందని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి తెలిపారు. తొగుటలో పంచాయతీరాజ్ శాఖ డివిజన్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తొగుట, రాయపోల్, దౌల్తాబాద్ మండలాలకు ప్రభుత్వం డీఈఈ కార్యాలయం మంజూరు చేయడం గొప్ప విషయమన్నారు. తొగుట సబ్ డివిజన్ ఏర్పాటుతో మూడు మండలాలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఉపఎన్నికలో ఒడిపోయినా దుబ్బాక అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టంచేశారు. అనంతరం మండలంలోని వెంకట్రావుపేట ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 5లక్షలు మంజూరు పత్రాలను ఎంపీ అందజేశారు. అలాగే తుక్కాపూర్, వెంకట్రావుపేట గ్రామాలకు చెందిన నర్సయ్యకు, నజీమొద్దీన్‌లకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ జడ్పీటీసీ రణం జ్యోతి, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, సర్పంచ్‌లు కొండల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మల్లయ్య, నర్సింలు, ఎంపీటీసీ సభ్యులు స్వామి, నర్సింలు, శరత్, కోఆప్షన్ సభ్యుడు కలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లతో వెట్టిచాకిరీ

ఎమ్మెల్యే రఘునందన్‌రావు


అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లతో వెట్టిచాకిరీ చేయిస్తుందని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం దుబ్బాక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు సంబంధం లేని పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఓటర్ నమోదుతో పాటు చాలా పనులకు వినియోగించుకుంటూ వారి న్యాయమైన డిమాండ్లను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వారికి మద్దతుగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బాలేష్‌గౌడ్, మచ్చ శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

బతుకమ్మ ఆటతో నిరసన

దుబ్బాకలో బతుకమ్మ ఆటతో అంగన్‌వాడీలు ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. సుమారు 2 గంటల పాటు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట తమ డిమాండ్లు పరిష్కరించాలని పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు భాస్కర్, పద్మ, నాగరాణి, భూలక్ష్మి, బసవరాణి, రమ, విజయ తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా కేసుల పరిశోధన

సిద్దిపేట సీపీ శ్వేత


మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: పారదర్శకంగా కేసుల పరిశోధన ఉండాలని, పెండింగ్‌లో ఉన్న సీసీ నెంబర్లు త్వరగా తీసుకోవాలని సిద్దిపేట సీపీ శ్వేత అన్నారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో పోలీసు అధికారులతో పెండింగ్ కేసులు, ఫంక్షనల్ వర్టికల్‌పై సీపీ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోర్టులో పెండింగ్ గ్రేవ్ ట్రయల్ కేసులు డిస్పోజల్ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 2021, 22 సంవత్సరంలో అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులు త్వరగా డిస్పోజల్ చేయాలని సూచించారు. నాన్ బెయిలబుల్ వారెంట్ ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ పోలీసు స్టేషన్లుగా ఎంపిక కావడానికి అధికారులు, సిబ్బంది పోటీపడి విధులు నిర్వర్తించాలన్నారు. సీసీటీఎన్ఎస్ ద్వారా ప్రతి దరఖాస్తు వివరాలు నమోదు చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీలు అడ్మిన్ శ్రీనివాసరావు, లా అండ్ ఆర్డర్ మల్లారెడ్డి, మహిళ పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, హుస్నాబాద్ పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నా.. ఏదీ రక్షణ?

- కొమురవెల్లి ఆలయంలో సీసీ కెమెరాల సిస్టం ధ్వంసం
- గుడి ఆవరణలో పనిచేయని కెమెరాలు
- సిబ్బందే ధ్వంసం చేశారని ఆలయ చైర్మన్ ఆరోపణ


ధ్వంసం అయిన సిస్టం యూనిట్

కొముురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో సీసీ కెమెరాలకు సంబంధించిన సిస్టం(ఎన్‌వీఆర్) ధ్వంసమైంది. దీంతో దేవాలయంలోని 32 కెమెరాలు పని చేయడం లేదు. గుడి పరిసరాలలో పనిచేసే సీసీ కెమెరాల సిస్టం యూనిట్‌ను ఏఈవో గదిలో అమర్చారు. ప్రస్తుతం దీనిని పగులకొట్టడంతో సీసీ కెమెరాలు పని చేయక నిత్యం స్వామివారి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తులకు రక్షణ కరువైంది. ఎవరో కావాలనే ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసినట్లుందని టెక్నీషియన్ చెబుతున్నాడు. దీంతో ఆలయంలో సిబ్బందిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వారం క్రితం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల గొడవ గురించి సీసీ ఫుటేజీ తీసుకుందామని మంగళవారం టెక్నీషియన్‌ను పిలిపించగా ఎన్‌వీఆర్ ధ్వంసమైన విషయం తెలిసింది. ఆలయ చైర్మన్ గీస భిక్షపతి వెంటనే విలేకరుల సమావేశం నిర్వహించి ఉద్యోగులే సీసీ కెమెరాల సిస్టం యూనిట్‌ను ధ్వంసం చేశారని ఆరోపించారు. కొద్దిరోజులుగా ఈయనకు, ఏఈఓ అంజయ్య మధ్య విభేదాలు తలెత్తడంతో ఆలయంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియకుండా ఉంది.

ఇది ఆలయ సిబ్బంది పనే..



ఆలయంలో పనిచేసే సిబ్బందే సీసీ కెమెరాలు పని చేయకుండా చేశారు. వీటి సిస్టం యూనిట్ ఏఈఓ అంజయ్య గదిలో ఉంది. ఆయనే కావాలని ధ్వంసం చేశారు. గతంలో కూడా డాటాను డిలీట్ చేశారు. దీనిపై దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తా.

– గీస భిక్షపతి, ఆలయ చైర్మన్

కక్ష సాధింపు చర్యలు

ఆలయంలో సీసీ కెమెరాల సిస్టంను ధ్వంసం చేయవలసిన అవసరం నాకు లేదు. చైర్మన్ కావాలనే కక్ష సాధింపు చర్యకు పాల్పడుతూ నాపై ఆరోపణలు చేస్తున్నారు. నాకు ఎలాంటి సంబంధం లేదు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి విషయాన్ని బహిర్గతం చేయాలి. చైర్మన్ గీస భిక్షపతే ధ్వంసం చేయించి నాపై నిందలు వేస్తున్నారు.

– అంజయ్య, ఏఈఓ

హత్యా.. ఆత్మహత్యా..?

- అనుమానాస్పద స్థితిలో యువతి మృతి
- రైలు పట్టాలపై మృతదేహం లభ్యం


నందిని(ఫైల్)

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని అల్లీపూర్ వద్ద రైలు పట్టాలపై అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన యువతి శవాన్ని మంగళవారం రైల్వే పోలీసులు గుర్తించారు. వికారాబాద్ రైల్వే పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. జహీరాబాద్ మండలం కొత్తూర్(బి) గ్రామానికి చెందిన మడపతి వీరయ్యస్వామి ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురి వివాహం కాగా, రెండో కుమార్తె మడపతి నందిని(20) హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటుంది. నగరంలో ఉంటున్న ఆమె అల్లీపూర్ వద్ద రైలు పట్టాలపై శవమై కనిపించింది. వికారాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం వద్ద లభించిన సెల్‌ఫోన్‌లోని నంబర్ల ఆధారంగా కుంటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నందిని ఆత్మహత్య చేసుకుందా..? ఎవరైనా హత్యచేశారా..? అనే విషయం తెలియాల్సి ఉంది. తండ్రి వీరయ్యస్వామి ఫిర్యాదు మేరకు వికారాబాద్ పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య


బాలయ్య (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): అప్పుల బాధ తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతెలో మంగళవారం జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నీల బాలయ్య (48) తనకున్న రెండు ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ భార్య కనకవ్వ, ముగ్గురు కొడుకులు బాల్‌రాజు, నాగరాజు, వేణును పోషించుకుంటున్నాడు. మూడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సుమారు రూ.3లక్షల వరకు అప్పు చేశాడు. వ్యవసాయం కోసం మరికొంత అప్పు చేశాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం తెలియక బాలయ్య మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి తాను చనిపోతున్నానని రెండో కుమారుడు నాగరాజుకు ఫోన్ చేసి తెలిపాడు. కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా అప్పటికే బాలయ్య చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భూంపల్లి ఎస్ఐ భువనేశ్వర్‌రావు తెలిపారు.

ఏసీ రిపేర్ నెంబర్ కోసం వెతికితే..

రూ.2.96 లక్షలు దోచేసిన సైబర్ నేరగాళ్లు



పటాన్‌చెరు టౌన్: ఏసీ రిపేర్ కోసం గూగుల్లో నెంబర్ కోసం శోధించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సైబర్ వలలో చిక్కుకుని రూ.2.96 లక్షలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశంకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సెప్టెంబర్ 9న ఏసీ రిపేర్ చేసే వారి కోసం గూగుల్లో శోధించాడు. ఈ క్రమంలో బాధితుడికి ఓ ఫోన్ నెంబర్ కనిపించగా దానికి కాల్ చేశాడు. దీంతో అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా ఓటీపీలు చెప్తూ వచ్చాడు. దీంతో అతని ఖాతాలో ఉన్న రూ.2.96లక్షలు మాయమయ్యాయి. బాధితుడు మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం మంగళవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛ్ బడి అద్భుతం: యూనిసెఫ్ బృందం


స్వచ్ఛ్ బడిని సందర్శించిన విదేశీ బృందం

సిద్దిపేటజోన్: సిద్దిపేటలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ్ బడి అద్భుతంగా ఉందని యూనిసెఫ్ బృందం కితాబు ఇచ్చింది. మంగళవారం వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు జిల్లాలో పర్యటించారు. ఇందులో భాగంగా స్వచ్ఛ్ బడిని సందర్శించారు. వారికి జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కమిషనర్ సంపత్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వచ్ఛ్ బడిలో క్లాత్ బ్యాంక్‌ను పరిశీలించారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చే క్రమంలో అందరూ జ్యూట్ బ్యాగ్స్, క్లాత్ బ్యాగ్స్ వాడేలా చైతన్యవంతం చేస్తున్న విషయాన్ని బల్దియా అధికారులు బృందానికి వివరించారు. స్టీల్ బ్యాంక్ ఏర్పాటు, చెత్త ద్వారా సేంద్రియ ఎరువుల తయారీ, రుతు ప్రేమ అమలు తీరు గురించి వారికి తెలియజేశారు. అనంతరం స్వచ్ఛ్ బడిలో నర్సరీ, గోశాల, సేంద్రియ ఎరువుల తయారీ ప్రక్రియ పరిశీలించారు. ఈ సందర్భంగా స్పెయిన్ దేశ ప్రతినిధి ఓన మాట్లాడారు. తన భర్త రవికుమార్ భారత్‌కు చెందిన వ్యక్తి కావడంతో మెట్టినిల్లుకు వచ్చిన అనుభూతి ఉందన్నారు. తనకు ఇక్కడి పద్ధతులు అంటే చాలా ఇష్టమని అన్నారు. కార్యక్రమంలో లిడిజ, తానియా, మార్టిన్హో, టాప్స్ ,వాన్, కుపర్, ఓటినో, ఫెనండో, టిమో, డ్యూక్, సైమస్ తదితరులు పాల్గొన్నారు.

ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టి..

కారు డ్రైవర్ మృతి

పటాన్‌చెరు టౌన్: ముందు వెళ్తున్న వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగేశ్వరావు తెలిపిన వివరాలు. అమీన్‌పూర్ మండల పరిధిలోని నవ్యనగర్‌కు చెందిన పటేల్ శ్రీనివాస్(45) క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున లింగంపల్లి వైపు నుంచి సంగారెడ్డి వైపు కారు డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తున్న శ్రీనివాస్ పటాన్‌చెరు మండలం ముత్తంగి చర్చి సమీపంలో ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని..

పటాన్‌చెరు టౌన్: లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగలక్ష్మి తెలిపిన వివరాలు. మధ్యప్రదేశ్‌కు చెందిన గోపాల్ టైగ(53) పటాన్‌చెరు ప్రయాణ ప్రాంగణం ఎదుట జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో అతన్ని లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి జేబులోని ఆధార్ ఆధారంగా మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధి ఉసిరికపల్లి బస్టాండ్ సమీపంలోని తూప్రాన్– నర్సాపూర్ హైవేపై సోమవారం రాత్రి జరిగింది. ఉసిరికపల్లి గ్రామానికి చెందిన కుందనపల్లి మరియా, స్వామి దంపతులు వస్తున్న బైక్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సిద్దికి మోంది వస్తున్న బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో స్వామి తలకు తీవ్ర గాయాలు కాగా, సయ్యద్ సిద్దికి మోంది కాలు విరిగింది. స్థానికులు వారిని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

శివ్వంపేట(నర్సాపూర్): చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి గల్లంతు కాగా, మంగళవారం మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. దొంతి గ్రామానికి చెందిన బాలోల్ల కృష్ణయ్య(55) సోమవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం శభాష్‌పల్లి పంచాయతీ పరిధిలోని పిల్లి గుండ్ల మత్తడి కుంటలో కృష్ణయ్య మృతదేహం కనిపించింది. కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. చేపలు పట్టేందుకు కుంటలోకి దిగి ప్రమాదవశాత్తు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య కృష్ణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ రవికాంత్‌రావ్ తెలిపారు.

జరిమానా వేస్తారనే భయంతో..

రామాయంపేట(మెదక్): చోరీ కేసులో పట్టుబడిన ఓ వ్యక్తి జరిమానా వేస్తారనే భయంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని ప్రగతి ధార్మారంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రంజిత్ తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన బండారి యాదాగౌడ్ (42)కు భార్యాపిల్లలున్నారు. కొంతకాలంగా మద్యానికి బానిసై ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. ఈనెల 9న గ్రామంలోని పెద్దమ్మ గుడిలో చోరీకి ప్రయత్నించి గ్రామస్తులకు పట్టుబడ్డాడు. గ్రామంలో పంచాయతీ నిర్వహించి జరిమానా వేస్తారనే భయంతో 10వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయిన యాదాగౌడ్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతదేహం మంగళవారం తేలింది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్య సమస్యలతో..


బ్రిజ్‌నందన్ ప్రసాద్ (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): అనారోగ్య సమస్యల కారణంగా ఓ వ్యక్తి భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ నయిమొద్దీన్, స్థానికులు తెలిపిన వివరాలు. బిహార్ రాష్ట్రానికి చెందిన బ్రిజ్‌నందన్ ప్రసాద్(65) కుటుంబంతో కలసి బొల్లారం బాలాజీనగర్‌లో అద్దెకు ఉంటున్నాడు. స్థానికంగా ఓ పరిశ్రమలో పనిచేసేవాడు. ఆరు నెలల నుంచి ప్రసాద్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. మంచానికే పరిమితం కావడంతో మనస్తాపం చెంది నివాసం ఉంటున్న ఐదంతస్తుల భవనం నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిఇకి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుటుంబ సమస్యలతో..


దుర్గయ్య (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మంగళవారం అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు. చిల్వెర గ్రామానికి చెందిన జిల దుర్గయ్య(35) ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక గత నెల 27న ఇంట్లో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతన్ని జోగిపేట ఆస్పత్రికి, అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.